# బ్లాక్ మెయిల్

"అమ్మాయి ఒక్కగానొక్క పిల్ల. గారంగా పెంచాము. అమ్మాయిని డాక్టర్ని చేద్దామండీ" అంది. రాధ.

"అలాగే. అమ్మాయి డాక్టరయితేనే బావుంటుంది. ఈ రోజుల్లో డాక్టర్లకున్న సంపాదన ఎవరికీ లేదు" అన్నాడు కృష్ణమూర్తి.

తల్లితండ్రుల మాటలు వింటున్న రజని "మీ ఇష్టాలేనా - నా ఇష్టంతో సంబంధం లేదా?" అంది కాళ్లూపుతూ.

"డాక్టర్ అవ్వాలని లేదా? ఇంజనీరింగు చదువుతావా?"

"ఊహూ"

"లాయర్ అవుతావా?"

"బోర్",

"సి.ఎ. చేస్తావా?"

"దొంగలెక్క లెవరు రాస్తారు?"

"మరేమిటి చదువుతావు?"

"బ్యూటీషియన్ కోర్సు. బ్యూటీషియన్ అవడమే నా జీవితాశయం"

"బ్యూటీషియన్ అవడం ఏమిటి? జుట్టు కత్తిరించడమంటే మంగలి పని కదూ?"

"దాన్నెవరూ మంగలిపని అనరు. హెయిర్ డ్రెస్సింగ్ అంటారు. మెడిసిన్ చదువమంటున్నారు - ఎందరు డాక్టర్లు ఈగలు తోలుకుంటున్నారో? ఒక్క బ్యూటీ పార్లర్ ఖాళీ చూపించు."

"వద్దమ్మా రజనీ! సంఘంలో మన గౌరవమేం కావాలి? మెడిసిన్ చదువు. మా అమ్మాయి డాక్టరని చెప్పకుంటే మాకు ఎంత గౌరవంగా ఉంటుందో!"

"మరి బెస్ట్ కోచింగ్ సెంటర్లో చేరుస్తారా?"

"తప్పకుండా!"

"కంబైన్డ్ స్టడీస్ చెయ్యనిస్తారా?"

"కొంచెం తెలివైన పిల్లలతో చదువుతావా?"

"వాట్ మమ్మీ... నేను తెలివి తక్కువ వాళ్లతో ఫ్రెండ్ షిప్ చేస్తానా?"

"సరే మనింట్లోనే కంబైన్డ్ స్టడీస్ పెట్టుకో"

ఇంట్లో అయితే కొంతవరకూ కూతుర్ని కంట్రోల్ చేయ్యవచ్చని రాధ ఉద్దేశం.

"మరి మనింట్లో కంబైన్డ్ స్టడీస్ అయితే వాళ్లు రాత్రి ఇక్కడే భోజనం చేస్తారు. రాత్రి నిద్ర రాకుండా

"అన్నీ నేను చూసుకుంటానుగా.... నువ్వు డాక్టరయితే చాలు."

కృష్ణమూర్తి ఇల్లు కంబైన్డ్ స్టడీ సెంటర్‌గా మారింది. రాధ కూతురి ఫ్రెండ్స్‌కి అన్నీ అమర్చి పెట్టే మనిషిగా మారింది.

రాత్రి గట్టిగా మ్యూజిక్ వినిపించింది.

"రజనీ! చదువుకోడం లేదా?" రాధ అడిగింది.

"చదువుకోక ఏం చేస్తున్నాను? మ్యూజిక్ వింటూంటే మనస్సు ప్రశాంతంగా ఉంది. చదివింది బాగా బుర్ర కెక్కుతుంది. మెడిసిన్ చదవమని ఎందుకు చెప్పారు? చదువుకునే వాతావరణం కల్పించకపోతే నన్ను ఎమ్‌సెట్ రాయమని కూడా చెప్పకండి."

"సరే మ్యూజిక్ వింటే విను, కానీ చదువు మాత్రం నెగ్లెక్ట్ చెయ్యొద్దు."

"రాత్రి తెల్లవార్లూ చదువుతాను సరేనా?" మ్యూజిక్ వాల్యూం పెంచుతూ అంది రజని.

రాధ మాట్లాడకుండా వచ్చేసింది.

❖ ❖ ❖

రాధ ఎంత తాపత్రయపడినా, కృష్ణమూర్తి ఎంత ఖర్చు పెట్టినా రజని ఎమ్‌సెట్‌లో ర్యాంకు తెచ్చుకోలేదు. తెచ్చుకోనందుకు బాధపడనూ లేదు.

"మొదటిసారే ఎవరూ పాసవరు. ఈ సారి ఫుల్‌టైం కోచింగ్ తీసుకొంటాను... తప్పకుండా సెలెక్టవతాను."

ఫుల్‌టైం కోచింగ్‌లో చేరింది రజని. ఆమె టి.వి. చూడ్డానికి కానీ, ఫ్రెండ్స్‌తో తిరగడానిక్కానీ అభ్యంతర పెట్టడానికి లేదు.

"ఎప్పుడూ చదువుతుంటే తలనొప్పి వస్తుంది. కొంతసేపైనా రిలాక్స్ కావాలి. లేకపోతే తల వేడెక్కి ఏదీ బుర్రకెక్కదు."

గట్టిగా ఏం చెప్పడానికి లేదు తల్లితండ్రులకి.

"మెడిసన్ చదవమనీ, ఎమ్‌సెట్‌కి బాగా ప్రిపేర్ అవమనీ ప్రాణం తీసింది మీరే. బ్యూటీషియన్ కోర్సు చేసి ఉంటే ఈపాటికి ఊరంతా నా పేరు మారుమోగిపోతూ

ఉండేది. కూతురు డాక్టరవాలని కోరిక ఉంటే అందుకు తగిన సదుపాయాలన్నీ సమకూర్చద్దా? రిలాక్సేషన్ లేకుండా ఎలా పని చెయ్యడం?"

పాఠకులు సరిగ్గా ఊహించారు. రజిని రెండోసారి కూడా ఎమ్‌సెట్‌లో ర్యాంకు తెచ్చుకోలేదు.

కానీ తల్లితండ్రులకు కూతురు డాక్టరు కావాలన్న కోరికను బ్లాక్‌మెయిల్ చేస్తూ రెండేళ్లు హాయిగా గడిపేసింది.

పిల్లలని మరీ దండించడం తప్పే. కానీ స్పేర్ ది రాడ్ అండ్ స్పాయిల్ ది చైల్డ్ కూడా చాలా చోట్ల వర్తిస్తుంది.

(ఆంధ్రప్రభ వీక్లీ)